



జనశక్తినగర్‌లో బురదను తొలగించే పనిలో...



ఆర్కే నగర్‌లో కూలిన విద్యుత్ స్తంభం

ఉష్ణోగ్రతలు గరిష్ఠం కనిష్ఠం 38.0 27.0

గాలీవాన బీభత్సం

● నేలకొరిగిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు ● విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ● చీకట్లో అనంతపురం, శివారు ప్రాంతాలు

అనంతపురం క్రైం/అర్బన్/రూరల్, మే 21: జిల్లాలో సోమవారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించాయి. నగరంలో భారీ ఎత్తున చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సమీపంలో పార్క్ చేసిన వాహనాలు ధ్వంసమయ్యాయి. నగరంలో అర్ధరాత్రి ఒంటి గంట వరకూ అంధకారం అలుముకుంది. కొన్ని కాలనీల్లో ఉదయం వరకూ విద్యుత్ సరఫరా సాధ్యం కాలేదు. శివారు కాలనీలలో మంగళవారం రాత్రి వరకూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. ప్రధాన రహదారులు, కాలనీలు జలమయమయ్యాయి. డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లడంతో నగరంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఓ వైపు అంధకారం, మరోవైపు అపరిశుభ్రతతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతింది. దీంతో మంగళవారం రాత్రి వరకూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ శాఖ సర్కిల్ ఆరు డివిజన్ల పరిధిలో 162 విద్యుత్ స్తంభాలు, 12 ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. దీంతో ఆ శాఖకు రూ.37.72 లక్షలు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

జనశక్తినగర్‌లో బురద..



మరమ్మతు పనులు





ఆర్టీసీ బస్టాండులో నిలిచిన నీరు

నగరం.. నరకం..

గాలీవాన బీభత్సానికి అనంతపురం నగరవాసులు నరకం అనుభవించారు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాలుగో రోడ్డు, యువజన కాలనీ, ఎంజీఎం, జనశక్తి నగర్, వేణుగోపాల్ నగర్, బళ్లారి రోడ్డు, హౌసింగ్ బోర్డు, రామ్‌నగర్, సోమనాథ్‌నగర్ ఆర్కే నగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో రాత్రి పదుల సంఖ్యలో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. హౌసింగ్ బోర్డులో చెట్లు కూలి వాహనాలు ధ్వంసమయ్యాయి.

ప్రమాదకరంగా ఆలమూరు-రుద్రంపేట రోడ్డు



28 మండలాల్లో వర్షం

జిల్లాలోని 28 మండలాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా రాప్తాడులో 45.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అనంతపురం 37.2, బుక్కరాయసముద్రంలో 34.2, నార్పలలో 28.2, కంబదూరులో 20.2, గార్లదిన్నెలో 20, శింగనమల 18.8, పామిడిలో 17.6, కణేకల్లు 17.2, గుత్తి 16.2, ఆత్మకూరు 15.6, గుమ్మఘట్ట 14.8, యాడికి 13.4, బొమ్మనహాళ్ 13.2, శెట్టూరు 12.4, వజ్రకరూరులో 12.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 10.6 మి.మీ.లోపు నమోదైంది.



హౌసింగ్‌బోర్డులో ద్విచక్ర వాహనాలపై కూలిన చెట్టు



నాలుగో రోడ్డులో నేలకూలిన చెట్టు

ఉద్యాన పంటలకు నష్టం

కూడేరు, ఉరవకొండ, అనంతపురం, బెళుగుప్ప మండలాల్లో గాలీవానకు అరటి పంట నేలకొరిగింది. కుందుర్పి, శెట్టూరులో టమోటా పంట దెబ్బతింది. పది మంది రైతులకు చెందిన 15.40 హెక్టార్లల్లో రూ.54 లక్షల విలువైన అరటి పంటకు నష్టం జరిగిందని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ నెలలో ఇప్పటి దాకా వర్షం ప్రభావంతో 56.60 హెక్టార్లల్లో రూ.1.80 కోట్ల విలువైన అరటి దెబ్బతింది. 1.80 హెక్టార్లల్లో రూ.3 లక్షల విలువైన టమోటాకు నష్టం జరిగింది. మొత్తం 58.40 హెక్టార్లల్లో రూ.1.83 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నాయి.

ఒకే రైతుకు రూ.70 లక్షల నష్టం

● అనంతపురం రూరల్ మండలంలో సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలకు కురుగుంట రైతు జి. లక్ష్మీనారాయణరెడ్డి సాగుచేసిన అరటి నేలకొరిగి దెబ్బతినింది. పది ఎకరాల్లో పంట సాగుకు రూ.35 లక్షల వరకు పెట్టుబడి పెట్టానని, వారం క్రితం కొంత, తాజాగా మొత్తం పంట దెబ్బతినిందని బాధిత రైతు వాపోయారు. ఇప్పటి వరకు ఒక లోడు రూ.1.60 లక్షలకు అమ్మానని, మరో 50 లోడుల దిగుబడి వచ్చేదని అన్నారు. వర్షం కారణంగా రూ.70 లక్షల వరకూ పంట నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

నేలకొరిగిన అరటి పంట



కౌంటింగ్ తర్వాత భద్రం

గొడవలు జరిగే ప్రమాదం

షాడో టీంలు ఏర్పాటు చేయండి

అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



కౌంటింగ్ ఏర్పాట్ల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, మే 21: ఎగ్జిట్ పోల్ ఫలితాలు విడుదల అయినపుడు, కౌంటింగ్ ముగిసిన తర్వాత గొడవలు జరిగే ప్రమాదం ఉందని ఇంటలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసు, ఇతర శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల ఫిర్యాదులు, కౌంటింగ్ ఏర్పాట్లు, శాంతిభద్రతల సమస్యపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రత్యేక షాడో టీంలను ఏర్పాటు చేయాలని, ఎవరెవరు ఎక్కడెక్కడ ఏం మాట్లాడుతున్నారు..? ఏం కుట్రలు చేయబోతున్నారో గుర్తించాలని, ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు సూచించారు. గత ఎన్నికలలో బైండోవర్ చేసిన వారి జాబితాను పరిశీలించి.. వారందరినీ ఈసారి కూడా బైండోవరు చేయించాలని అన్నారు. ఆర్డీఓలు గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని, అల్లర్లు చేస్తే పోలీసులు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటారని తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే నేర ప్రవృత్తి ఉన్న ఎనిమిది మంది గూండాలు, జూదం, మట్కా ఆడేవారిని జిల్లా నుంచి బహిష్కరించామని తెలిపారు. ఎన్నికల విషయంలో గొడవలకు దిగినవారికి ఇదే పరిస్థితి వస్తుందని అల్లరిమూకలను హెచ్చరించాలని సూచించారు.

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

జేఎన్‌టీయూలో జూన్ 4న జరిగే కౌంటింగ్‌కు ముగ్గురు పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించిందని కలెక్టర్ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్స్‌కు నాలుగువైపులా నిఘా ఏర్పాటు చేశామని అన్నారు. అనంతపురం అర్బన్, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఐఏఎస్ మనీష్ సింగ్, ఉరవకొండ, కళ్యాణదుర్గం, శింగనమల నియోజకవర్గాలకు ఐఏఎస్ అజయ్‌నాథ్, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాలకు ఐఏఎస్ అజయ్ కుమార్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించిందని తెలిపారు. కౌంటింగ్‌కు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించకూడదని హెచ్చరించారు. కౌంటింగ్ సమయంలో ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. స్ట్రాంగ్ రూమ్స్‌కు నాలుగు వైపుల సీసీ కెమెరాల నిఘా పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రోజుకు రెండుసార్లు స్ట్రాంగ్ రూమ్స్‌ను పరిశీలించి, రికార్డులలో నమోదు చేయాలని, ఆ వివరాలు పంపాలని ఆదేశించారు. సమీక్షలో నగరపాలిక కమిషనర్ మేఘస్వరూప్, జడ్పీ సీఈఓ వైభవ్ నిదియా, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్వో రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర అలజడి

రాయదుర్గంలో టెకీ అరెస్టు

బెంగళూరు పేలుళ్లతో సంబంధం..?

ఎన్నికల వేళ జిల్లాకు కొత్త సమస్య

అప్రమత్తమైన పోలీసులు.. జిల్లా జల్లెడ

అనంతపురం క్రైం, మే 21: ఎన్నికల గొడవలను ఆసరాగా చేసుకుని.. ఉగ్ర మూకలు దాడికి తెగబడాలని చూస్తున్నాయా..? జూన్ 5న రాష్ట్రంలో ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉందని నిఘా వర్గాల హెచ్చరికలు.. రాయదుర్గంలో ఎన్ఐఏ దాడులు.. జిల్లాలో కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే జూన్ 4న కౌటింగ్ తరువాత రాజకీయ హింస జరుగుతుందన్న ఆందోళన నెలకొంది. పోలీసు శాఖ అప్రమత్తమైంది. కార్డెన్ సర్చ్ పేరిట అనుమానితుల ఇళ్లను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రాయదర్గంలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) అధికారులు మంగళవారం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సుహిల్‌నును అదుపులోకి తీసుకున్నాయి. దీంతో కేంద్ర నిఘా విభాగం హెచ్చరికలు నిజమేనా...? అనే అనుమానం బలపడుతోంది. సుహిల్ బెంగుళూరులో పనిచేసిన సమయంలో ఉగ్రవాద సంస్థ నాయకుల గదిలో ఉన్నారని సమాచారం. వారితో పరిచయం సుహిల్‌ను ఉగ్రవాదానికి దగ్గర చేసినట్లు అనుమానిస్తున్నారు. సుహిల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న ఎన్ఐఏ అధికారులు.. అతని కాల్‌రికార్డ్స్, ఫొటోలు, వాట్సాప్ చాటింగ్‌ను పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. జిల్లాలో సుహిల్ ఒక్కడే ఉన్నాడా, మరికొందరు ఉన్నారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

అప్రమత్తంగా ఉండాల్సిందే..

ఎన్ఐఏ దాడులు.. సుహిల్ అరెస్టుతో అందరిలో భయాందోళనలు వ్యక్తమౌతున్నాయి. జూన్ 4 నుంచి 19 వరకు అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖను ఎన్నికల సంఘం, నిఘా వర్గాలు హెచ్చరించాయి. కౌంటింగ్ తదనంతర పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించాయి. అల్లర్లు, ప్రతీకార దాడులు జరిగే ప్రమాదం ఉందని, కట్టడి చేయాలని హెచ్చరించాయి. జిల్లాలో తాడిపత్రితో పాటు రాప్తాడు, ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాల్లో గొడవలు జరిగే ప్రమాదం ఉంది. దీంతో పోలీసులు ఆ ప్రాంతాలపై గట్టి నిఘా వేశారు. ఎన్నికల గొడవలను కట్టడి చేసేందుకు సిద్ధమౌతున్న పోలీసులకు ఎన్ఐఏ దాడులు.. ఉగ్ర మూకల ఆనవాళ్లు జిల్లాలో ఉండటం పెను సవాలుగా మారనుంది. సుహిల్‌ను ఎన్ఐఏ అదుపులోకి తీసుకోవడంతో పోలీస్ శాఖలో అలజడి మొదలైంది. ఎన్నికల వ్యవహారంతోనే పిచ్చెక్కిపోతుంటే మళ్లీ ఇదెక్కడి గొడవ అని తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో గతంలోనూ ఎన్ఐఏ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కానీ అవన్నీ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారికి సంబంధించినవే. కానీ తొలిసారిగా ఉగ్రవాదులతో సంబంధం ఉందన్న అనుమానంతో ఒకరిని అరెస్టు చేయడం కలకలం రేపుతోంది.



రాయదుర్గంలో సుహిల్‌ని అదుపులోకి తీసుకుని తరలిస్తున్న ఎన్ఐఏ అధికారులు

జల్లెడ పడుతున్న పోలీసులు

కార్డెన్ సెర్చ్ పేరిట జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్పీ గౌతమి శాలి ఆదేశాల మేరకు అన్ని సబ్ డివిజన్ల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో మంగళవారం తనిఖీలు చేశారు. రౌడీషీటర్లు, పాత కేసుల్లో నిందితులు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితుల ఇళ్లలో గాలించారు. అనంతపురం, తాడిపత్రి, నార్పల పోలీస్ స్టేషన్ల పరిధిలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. ఇప్పటి వరకూ జిల్లాలో 381 మందిని బైండోవర్ చేశారు. 136 మంది రౌడీషీటర్లు, కిరాయి హంతకుల, ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలు సృష్టించినా, ప్రేరేపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రెండు రోజుల క్రితం తాడిపత్రిలో పోలీసుల కవాతు

జిల్లా బహిష్కరణ



మట్కా బీటర్ అబ్దుల్లాకు నోటీసు

అనంతపురం క్రైం/గార్లదిన్నె, మే 21: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా నుంచి ఎనిమిది మందిని బహిష్కరించానమని ఎస్పీ గౌతమి శాలి మంగళవారం తెలిపారు. వీరిలో మట్కా నిర్వాహకులు గడిమాబు(శాంతినగర్, గుంతకల్లు), కడపల వెంకటరాముడు (రాణినగర్, అనంతపురం), దూదేకుల అబ్దుల్ (గార్లదిన్నె), చాకలి చలపతి (తారకరామాపురం కొట్టాల, వేణుగోపాల నగర్ అనంతపురం) ఉన్నారు. అక్రమ మద్యం విక్రేతలు అనంతపురం నగరంలోని బుడ్డప్ప నగర్‌కు చెందిన షికారి భగవాన్, బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన అంకె నారాయణ, కంబదూరు గుండ్లపల్లి కాలనీకి చెందిన ఎరికల ముత్యాలన్న, గుండా ఎరికల శేఖర్‌ను జిల్లా నుంచి బహిష్కరించామని ఎస్పీ తెలిపారు.



ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.7

పాఠకుని పూర్తి పేరు : ....

దోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.


నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. అనంతపురం అర్బన్				
2. రాప్తాడు				
3. శింగనమల				
4. తాడిపత్రి				
5. గుంతకల్లు				
6. ఉరవకొండ				
7. కళ్యాణదుర్గం				
8. రాయదుర్గం				
9. ధర్మవరం				
10. కదిరి				
11. పుట్టపర్తి				
12. పెనుకొండ				
13. హిందూపురం				
14. మడకశిర				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 239-2ఎ, బెంగళూరు బైపాస్, కక్కలపల్లి క్రాస్, అనంతపురము- 515001.

*షరతులు వర్తిస్తాయి

గెలుపు ఆమెదేనా?



అనంతపురం, మే 21(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి జిల్లాలో మహిళలకు అత్యధిక సీట్లు దక్కాయి. ఆరుగురు మహిళలు అసెంబ్లీకి, ఒకరు పార్లమెంటు స్థానానికి పోటీ పడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుం చి ముగ్గురు మహిళలకు మాత్రమే పోటీచేసే అవ కాశం దక్కింది. అందులో ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం శింగనమల నుంచి జొన్నలగడ్డ పద్మావతి, బండారు శ్రావణిశ్రీ పోటీపడ్డారు. వీరిలో వైసీపీ తరుపున పోటీ చేసిన జొన్నలగడ్డ పద్మావతి విజయం సాధించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా ఉష శ్రీచరణ్ పోటీ చేసి గెలుపొందారు. జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు నియోజకవర్గాలుండగా ఇద్దరు మహిళలు మాత్రమే గత ఎన్నికల్లో గెలుపొంది చట్టసభల్లో ప్రవేశించారు

- ఉమ్మడి జిల్లాలో ఏడుగురు మహిళల పోటీ
- అసెంబ్లీకి ఆరుగురు.. పార్లమెంటు బరిలో ఒకరు
- టీడీపీ తరుపున నలుగురు, వైసీపీ నుంచి ముగ్గురు
- కూటమి అభ్యర్థులకే విజయావకాశాలంటున్న విశ్లేషకులు

ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేస్తున్నారంటే...

ఉమ్మడి జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు స్థానంలో మహిళా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇప్పటికే పోలింగ్ ముగిసిన నేపథ్యంలో వారి భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. కూటమి టీడీపీ తరపున నాలుగు అసెంబ్లీ స్థానాల నుంచి మహిళా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అధికార వైసీపీ నుంచి ఇద్దరు మహిళా అభ్యర్థులు అసెంబ్లీ, ఒకరు పార్లమెంటు స్థానం నుంచి బరిలో ఉన్నారు. కూటమి తరపున రాప్తాడు నుంచి మాజీ మంత్రి పరిటాల సునీత, పెనుకొండ నుంచి సవిత, శింగనమల నుంచి బండారు శ్రావణిశ్రీ, పుట్టపర్తి నుంచి పల్లె సింధూరరెడ్డి పోటీ చేశారు. ఇక వైసీపీ తరపున పెనుకొండ నుంచి మంత్రి ఉష శ్రీచరణ్, హిందూపురం నుంచి దీపిక పోటీ చేస్తుండగా... హిందూపురం పార్లమెంటు స్థానం నుంచి శాంతమ్మ పోటీ చేశారు.

గెలుపెవరిదో..?

ఉమ్మడి జిల్లాలో పోటీ చేసిన మహిళా అభ్యర్థుల్లో ఎవరు గెలుస్తారోననే విషయం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే టీడీపీ అభ్యర్థులకే విజయావకాశాలు మెండుగా ఉన్నాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇందుకు కూటమి మేనిఫెస్టోపై ప్రజల్లో సంతృప్తి ఒక కారణమైతే.. వైసీపీ పాలనపై వ్యతిరేకత మరో కారణంగా చెబుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో బటన్ నొక్కుడు తప్పా... జిల్లాలో ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపకపోవడంతో నిరుద్యోగ యువతలో వైసీపీ పాలన పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వైసీపీ ప్రజాప్రతినిధుల అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలు, అవినీతిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది.

ఓటమెరుగని పరిటాల సునీత



టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి పరిటాల సునీత రాప్తాడు నుంచి పోటీ చేశారు. ఆమె రాజకీయాల్లోకి వచ్చిన నాటినుంచి పోటీచేసిన ప్రతి ఎన్నికల్లోనూ గెలుపొందుతూ వచ్చారు. 2019లో ఆ నియోజకవర్గం నుంచి ఆమె స్థానంలో తనయుడు పరిటాల శ్రీరామ్ పోటీచేసి ఓటమి చవిచూశారు. అయితే ఈ ఎన్నికల్లో తిరిగి పరిటాల సునీత పోటీ చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో విజయం సాధించిన ఆమె చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. ఆ కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ప్రస్తుతం ఆమెపై పోటీ చేసిన వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దౌర్జన్యాలు, అక్రమాలు యథేచ్ఛగా కొనసాగించారనే విమర్శలు వారిపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరిటాల సునీత వైపే విజయావకాశాలు ఉన్నాయనే అభిప్రాయం విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతోంది.

మంత్రికి ఎదురు దెబ్బేనా?



పెనుకొండ నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున పోటీ చేస్తున్న మంత్రి ఉష శ్రీచరణ్ కళ్యాణదుర్గానికి ప్రాతినిథ్యం వహించిన విషయం తెలిసిందే. అక్కడ ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమెను పెనుకొండ నుంచి ఆ పార్టీ అధిష్ఠానం పోటీ చేయించింది. ఆ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి రామచంద్రారెడ్డి కుమార్తె సవిత పోటీ చేశారు. ఈమె లోకల్ కావడం మంత్రి ఉష శ్రీచరణ్‌కు పెద్ద ఎదురుదెబ్బే.



శ్రావణిశ్రీకి కలిసొస్తున్న కాలం!



శింగనమల నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీకి సానుభూతిపవనాలు మెండుగా వీస్తున్నాయి. అధికార వైసీపీ నుంచి కొత్త వ్యక్తిని రంగంలోకి దింపడంతో ఆ పార్టీలోని ఆ నియోజకవర్గ దళిత నేతల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడం శ్రావణికి కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. దీనికి తోడు ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త, ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి మీద అనేక అవినీతి, ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికార పార్టీ సామాజికవర్గంలోని కొందరు నేతలు ఆ దంపతుల వ్యవహారశైలిపై గుర్రుగా ఉన్నారు. ఈ పరిణామాలే శ్రావణిశ్రీ విజయానికి దోహదపడతాయంటున్నారు.

విజయ 'సింధూర'మే?



పుట్టపర్తి నియోజకవర్గం నుంచి కూటమి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు పల్లె సింధూరరెడ్డిని పోటీలో నిలపడంతో మహిళల్లో మంచి ఆదరణ కనిపిస్తోంది. మామపై ఎలాంటి అవినీతి, అరోపణలు లేకపోవడానికి తోడు సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రస్తుత వైసీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డిపై అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలు ఉన్నాయి. అలాగే అధికార పార్టీ సామాజికవర్గంలోని కొందరు శ్రీధర్‌రెడ్డిపై గుర్రుగా ఉండటం సింధూరరెడ్డి గెలుపునకు కలిసొచ్చే అంశాలుగా చెబుతున్నారు.

దీపికకు కష్టమే..



దీపిక

హిందూపురం నియోజకవర్గం నుంచి మూడోసారి టీడీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పోటీ చేశారు. అధికార వైసీపీ నుంచి కొత్తగా దీపికను బరిలో నిలిపారు. ఈ నియోజకవర్గం టీడీపీకి తొలి నుంచి కంచుకోట కావడంతో బాలకృష్ణ హ్యాట్రిక్ కొట్టడం తథ్యమంటున్నారు.



పార్లమెంట్ బరిలో లోకల్ వర్సెస్ నాన్ లోకల్



హిందూపురం పార్లమెంటు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి పోటీలో ఉన్నారు. అధికార వైసీపీ నుంచి శాంతమ్మ బరిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్‌గా పని చేసిన బీకేకి 14 నియోజకవర్గాల్లో పార్టీ పరంగానే కాకుండా వ్యక్తిగతంగానూ బలమైన పరిచయాలు ఉన్నాయి. దీనికి తోడు ఆయన సామాజికవర్గమూ ఆ పార్లమెంటు స్థానంలో బలంగా ఉంది. అధికార వైసీపీ అభ్యర్థిది పొరుగు రాష్ట్రం బళ్లారి జిల్లా కావడంతో లోకల్, నాన్ లోకల్ అనే భావన అందరిలోనూ వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేసే అర్హత తమకు లేదా అనే అసంతృప్తి స్థానిక నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఈ పర్యవసానాలన్నీ టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి గెలుపుకు దోహదపడతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే గెలుపెవరన్నది తెలియాలంటే మరిన్ని రోజులు ఆగాల్సిందే.

'పీఎం బాల పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, మే 21 : జాతీయ స్థాయిలో 2025లో అందించే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌కు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రంగాల్లో విశేషమైన ప్రతిభ చూపిన బాలలకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు అందిస్తుందన్నారు. అర్హులైన బాలలు జులై 31వ తేదీలోగా http ://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివారలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హులకు 2025 జనవరి 26వ తేదీ ఢిల్లీలో గణతంత్ర దినోత్సవం రోజున ప్రధానమంత్రి చేతుల మీదుగా అందజేస్తారని తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.37వేలు

అనంతపురంరూరల్, మే 21: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కె ట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 763 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



విద్యుత్ శాఖకు రూ.37.72లక్షల నష్టం

- ఈదురుగాలులకు నేలకొరిగిన స్తంభాలు..ట్రాన్స్‌ఫార్మర్లు

అనంతపురం రూరల్, మే21: ఈదురుగాలుల కారణంగా ఉమ్మడిజిల్లాలో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ శాఖ సర్కిల్ ఆరుడివిజన్ల పరిధిలో 162 విద్యుత్ స్తంభాలు, 12ట్రాన్స్‌ఫార్మర్లు నేల కూలాయి. దీంతో విద్యుత్ శాఖకు రూ.37.72 లక్షల నష్టం జరిగినట్లు సంబంధిత అధికారులు అంచనా వేశారు. కళ్యాణదుర్గం , అనంతపురం టౌన్ డివిజన్ పరిధిలో అత్యధికంగా విద్యుత్ శాఖకు నష్టం జరిగింది. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో 39 విద్యుత్ స్తంభాలు, 5ట్రాన్స్‌ఫార్మర్లు, అనంతపురం టౌన్ డివిజన్ పరిధిలో 45 విద్యుత్ స్తంభాలు, 3ట్రాన్స్‌ఫార్మర్లు, అనంతపురం రూరల్ డివిజన్ పరిధిలో 22 స్తంభాలు, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు, గుత్తి డివిజన్ పరిధిలో 34స్తంభాలు, హిందుపురం డివిజన్‌లో 17స్తంభాలు, కదిరిలో 5స్తంభాలు నేలకొరిగాయి. ఈదురుగాలు, వర్షం కారణంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం రాత్రి 8గంటల నుంచి ఆయా ప్రాంతాల్లో సంబంధిత అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. స్తంభా లు, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోవడంతో చాలా ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ పునరుద్ధరణ కాని పరిస్థితులున్నాయి. అనంతపురం టౌన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌లైన్ల మరమ్మత్తులు చేపట్టి మధ్యాహ్నం మూడుగంటలకు విద్యుత్ సరఫరా అందించారు. మరి కొన్ని ప్రాంతాల్లో రాత్రి 7గంటల వరకు కూడా విద్యుత్ పునరుద్ధరణ కాని పరిస్థితులు నెలకొన్నాయి. అంధకారంలో ప్రజలు రాత్రంతా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



నగరంలో నేలకూలిన విద్యుత్ స్తంభాలు



నేటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు

బంద్..!

- రూ.కోట్ల బకాయిలపై ఆస్పత్రి యాజమాన్యాల సీరియస్

అనంతపురం టౌన్, మే21 : పేదలకు అండగా నిలిచి ఆరోగ్యాన్ని అందించిన ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. రూ.కోట్ల రూపాయల బకాయిలు చెల్లించకపోవడంతో ఆస్పత్రి యాజమాన్యాలు తిరుగు బావుటా ఎగరవేయడానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే పలుమార్లు హెచ్చరించిన ప్రైవేటు, కార్పోరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు సేవల నిలుపుదలకే నిర్ణయం తీసుకున్నారుయి. పలు మార్లు సేవల బంద్‌కు పిలుపునిచ్చినా ప్రభుత్వం వారితో చర్చలు జరుపుతూ కొంత మొత్తాన్ని చెల్లిస్తూ వచ్చింది. దీంతో పాటు కొందరు ప్రభుత్వ పెద్దలు బెదిరింపులకు దిగడంతో సమ్మెను విరమించుకుంటూ వస్తున్నారు. తాజాగా అప్పులు చెల్లించాలని లేకపోతే బుదవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీస్ ఇచ్చారు. ఈసారి ఎంత బెదిరించినా, బుజ్జగించినా వెనక్కి తగ్గేది లేదని, బకాయిలు చెల్లించేవరకు సేవలు అందించేది లేదని అసోషియన్ నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇదే జరిగితే జిల్లాలో 44 కార్పోరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు బంద్ కానున్నాయి. ఇప్పటికే ఆమేరకు జిల్లాలో కూడా ఆస్పత్రుల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు బంద్ అయితే తమ పరిస్థితి ఏంటని పలు పేదవర్గాలు ఆందోళన చెందుతున్నారు.

- అధికారుల రికార్డుల ఆదారంగా రోజుకు జిల్లాలో వివిద వ్యాదులకు సంబంధించి దాదాపు 500నుంచి 750మంది వరకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు పొందుతున్నారు. ఆస్పత్రులు బంద్ చేస్తే సీరియస్ కేసుల పరిస్థితి ఏంటనే ఆందోళన మొదలైంది. అయితే ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌ను అడిగితే మాత్రం ఆరోగ్యశ్రీ సేవల బంద్‌కు నోటీస్ ఇచ్చిన మాట వాస్తవమేనని, అయితే రాష్ట్ర స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, బకాయిలు చెల్లించే అవకాశం ఉందని, దీంతో వైద్యసేవలు యథాతతంగా కొనసాగుతాయని తెలిపారు. ఏమి జరుగుతుందో వేచి చూడాలి మరి..?

వైసీపీ నాయకుడి వాహనాల సీజ్

రాప్తాడు, మే 21: మండలంలోని గొందిరెడ్డిపల్లి సమీపంలో గుట్టలో నుంచి అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న షల్లలరేవు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు అంజికి చెందిన రెండు వాహనాలను సీజ్ చేశామని రాప్తాడు పోలీసులు తెలిపారు. మంగళవారం ఎర్రమట్టి తవ్వే ప్రదేశానికి వెళ్లి అనుమతి లేకుండా తరలిస్తున్న ఒక టిప్పర్, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ వాహనాలను రాప్తాడు పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి సీజ్ చేశామని, వాటిని మైన్స్ అధికారులకు అందజేస్తామని తెలిపారు.


తాడిపత్రి వైసీపీ నేతల కోసం గాలింపు

బుక్కరాయసముద్రం, మే 21: తాడిపత్రి నియోజకవర్గంలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఘర్షణ ఘటనలో నిందితులుగా ఉన్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి అనుచరుల కోసం పోలీసులు గాలింపులు చర్యలు చేపట్టారు. మండలంలోని జంతులూరులో వైసీపీ సర్పంచ్ లక్ష్మిరెడ్డి తోటలో తాడిపత్రి ఘటనలో ఉన్న నిందితులు ఉన్నట్లు జిల్లా పోలీసు అధికారులకు మంగళవారం సమాచారం అందింది. జిల్లా ప్రత్యేక పోలీసు బృందంతో పాటు స్పెషల్ పార్టీ, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, బుక్కరాయసముద్రం పోలీసులు ఆ తోటపై దాడులు నిర్వహించారు. విషయాన్ని తమ అనుచరుల ద్వారా సమాచారం అందుకోవడంతో అక్కడి నుంచి వైసీపీ నేతలు పరారైనట్లు సమాచారం. ఆ తోటలో బిర్యానీలు, మందు సీసాలు ఉండటాన్ని పోలీసులు గమనించారు. ఆ గ్రామంలోని పలు తోటల్లో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... గ్రామాల్లోకి ఎవరైన కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

శివపురంలో వైసీపీ రౌడీయిజం

- ఎన్నికల్లో టీడీపీకి పనిచేశారని దాడి
- నలుగురికి తీవ్ర గాయాలు

శింగనమల, మే 21: ఎన్నికల్లో టీడీపీ కోసం పనిచేసినందుకు వైసీపీ వర్గీయులు దాడికి తెగబడ్డారు. శింగనమల మండలం శివపురంలో టీడీపీ కార్యకర్త ఇంట్లోకి మంగళవారం సాయంత్రం చొరబడి కొడవళ్లతో దాడి చేశారు. దీంతో నలుగురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన బోయ పెద్దన్న, కొండప్ప అన్నదమ్ములు. వీరు టీడీపీ కార్యకర్తలు. పెద్దన్నకు అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకడు పత్రా వెంకటప్ప కుటుంబానికి పొలం వద్ద రస్తా తగాదా ఉంది. ఎన్నికల్లో పెద్దన్న టీడీపీ తరపున పనిచేశారు. దీంతో ఆ పార్టీ కోసం పనిచేయొద్దని వైసీపీ నాయకులు పెద్దన్నను పలు మార్లు హెచ్చరించారు. అయినా పట్టించుకోకుండా పనిచేయడంతో వైసీపీ నాయకులు కక్ష కట్టారు. వైసీపీ వర్గీయులు ప్రసాద్, మురళి, శేఖర్, రాజు, వెంకటరమయ్య, భాస్కర్, క్రాంతి తదితరులు మద్యం సేవించి పెద్దన్న ఇంటిపై దాడి చేశారు. పెద్దన్న వారి నుంచి తప్పించుకుని, తన అన్న కొండప్ప ఇంట్లోకి దూరాడు. వెంబడించిన వైసీపీ వర్గీయులు.. కొండప్ప ఇంట్లోకి చొరబడి కొండప్ప, ఆయన కూతురు హిమాజకూమారి, అల్లుడు మురళి, పెద్దన్న భార్య పద్మావతిపై దాడి చేశారు. తీవ్ర గాయాలు కావడంతో నలుగురినీ అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని శింగనమల ఏఎస్ఐ చితంబరప్ప తెలిపారు.



గాయపడ్డ కొండప్ప



పద్మావతి



హిమజ కూమారి

తాడిపత్రికి మళ్లీ సిట్

- పోలీసులకు కునుకు కరువు

తాడిపత్రి టౌన్, మే 21: సిట్ బృందం తాడిపత్రికి మరోసారి వచ్చింది. పోలింగ్, ఆ మరుసటి రోజు జరిగిన గొడవల గురించి సిట్ అధికారులు మంగళవారం మరోమారు విచారించారు. సిట్ సభ్యులు శ్రీనివాసులు, భూషణం, శ్రీనివాస్ తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. రికార్డులను, అల్లర్లకు సంబంధించిన వీడియోలను పరిశీలించారు. హింసాత్మక ఘటనల గురించి పూర్తిస్థాయి వివరాలు సేకరించేందుకు మరోసారి వారు వచ్చినట్లు సమాచారం. గొడవ జరగడానికి ప్రధాన కారణం, రాళ్లదాడి జరిగినా పోలీసులు ఎందుకు నియంత్రించలేకపోయారని స్థానిక పోలీసులను అడిగినట్లు తెలిసింది. గొడవలు జరిగే ప్రమాదం ఉందని ఎస్‌బీ అధికారులు ముందే గుర్తించి సమాచారం ఇచ్చారా..? లేదా..? సమాచారం ఇచ్చినా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారా..? అనే కోణాల్లో సిట్ దర్యాప్తు చేస్తోందని సమాచారం. తాడిపత్రి గొడవల నేపథ్యంలో ఇప్పటికే ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ సస్పెండ్ అయ్యారు. సిట్ దర్యాప్తు తరువాత తమ పరిస్థితి ఏమిటోనని పోలీసులు ఆందోళన చెందుతున్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకూ సిట్ బృందం తాడిపత్రిలోనే తిష్ట వేస్తుందని ప్రచారం సాగుతోంది. దీంతో స్థానిక పోలీసులకు కంటిమీద కునుకు కరువైంది.



రూరల్ పీఎస్‌లో సిట్ అధికారుల వాహనం

నా లెక్క నాకి పడెయ్..!

- అసమ్మతి వర్గీయుడి ఇంటిపైకి ఎమ్మెల్యే బంధువులు
- టీడీపీ తరఫున ప్రచారం చేశారని దాడికి యత్నం

శింగనమల, మే 21: ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి తరపున ప్రచారం చేసినందుకు వైసీపీ అసమ్మతి నాయకుడు పట్నం నగేష్ ఇంటిపై ఆ పార్టీ నాయకులు దాడికి యత్నించారు. తమ బకాయి డబ్బులు చెల్లించాలని దూషణకు దిగారు. ఈ ఘటన శింగనమల మండలం చిన్నజలాలపురంలో మంగళవారం చోటుచేసుకుంది. శింగనమల వైసీపీ టిక్కెట్‌ను సిటింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి వర్గీయుడైన వీరాంజనేయులుకు ఆ పార్టీ కేటాయించింది. దీంతో ఎమ్మెల్యే, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డిని వ్యతిరేకించే వర్గం ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తరపున పనిచేసింది. ఈ వర్గంలో పట్నం నగేష్ ఒకరు. దీంతో ఆగ్రహించిన ఆలూరు సాంబశివారెడ్డి మేనమామ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఆయన బావమరిది బాలిరెడ్డి, సోదనపల్లి సర్పంచ్ గోపాల్ రెడ్డి తదితరులు నగేష్ ఇంటి వద్దకు వెళ్లారు. బకాయి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ దాడికి యత్నించారు. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడి నుంచి జారుకున్నారు. ఈ ఘటనపై శింగనమల పోలీస్ స్టేషన్ పట్నం నగేష్ ఫిర్యాదు చేశారు. శ్రీరామిరెడ్డికి తాను బకాయి లేనని, ఇవ్వాల్సిన రూ.3.50 లక్షలు గతంలోనే ఇచ్చేశానని నగేష్ అన్నారు. అసమ్మతివర్గం సమావేశానికి వెళ్లినందుకు గతం లో తన తోటకు నిప్పు పెట్టి నష్టం కలిగించారని, ఎమ్మెల్యే భర్త, వారి బంధువు శ్రీరామిరెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని బాధితుడు పేర్కొన్నాడు.



పట్నం నగేష్ ఇంటివద్ద గొడవకు దిగుతున్న వైసీపీ నాయకులు

పరీక్ష తప్పినందుకు మనస్థాపంతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

పుట్టపర్తి రూరల్, మే 21: పరీక్ష తప్పానన్న మనస్థాపంతో బీటెక్ విద్యార్థి గౌతమ్ (23) ఆత్మహత్య చేసుకున్న ఘటన మునిసిపల్ పరిధిలోని ఎనుమలపల్లి గణేష్‌కూడలిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎనుమలపల్లి గణేష్‌కూడలిలో కాపురమంటున్న ఆనంద్, ఉషా దంపతుల కుమారుడు గౌతమ్. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈక్రమంలో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. ఆ సబ్జెక్టులను ఇటీవల జరిగిన సప్లిమెంటరీలో రాశాడు. తిరిగి పరీక్షల్లో ఫెయిలవ్వడంతో మనస్థాపం చెందాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఆనంద్ స్థానికంగా ఓ విల్లాలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి తెలిపారు.



విద్యార్థి గౌతమ్ (ఫైల్)

ఫ్లై ఓవర్ నిర్మాణం ఎప్పుడో...!

గార్లదిన్నె, పెనకచెర్ల మార్గంలో ప్రయాణికుల పాట్లు.. అరగంటకోసారి రైల్వే గేట్ వేస్తుండటంతో ఇబ్బందులు

గార్లదిన్నె, మే 21: గార్లదిన్నె నుంచి పెనకచెర్ల డ్యాం వెళ్లే దారిలో రైల్వే గేటు ఉంది. మర్తాడు, కోటంక, బూదేడు, సంజీవపురం, క్రిష్ణాపురం, యర్రగుంట్ల, పెనకచెర్ల, డ్యాం, ముకుందాపురం, కమలాపురం, కొట్టాపల్లి తదితర గ్రామాలకు ఈ మార్గంలోనే వెళ్లాలి. నిత్యం ఈ మార్గం ద్వారా వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాలు, 108, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఇలా వివిధ రకాల వాహనాలు ఈ దారిన ఆ గ్రామాలకు వెళ్లాల్సిందే. ఈ రైల్వే ట్రాక్‌పై ఇటు బెంగళూరు వైపు, అటు హైదరాబాద్ వైపు వెళ్లే రైళ్లు ప్రతి అరగంటకో సారి వస్తుంటాయి. దీంతో రైలు వచ్చినప్పుడల్లా సుమారు 10 నుంచి 15 నిమిషాలు పాటు రైల్వే గేటు వేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామాల్లో ఎవరికైనా జబ్బు చేస్తే అత్యసవర వైద్య సేవలకు అనంతపురం పోవాలంటే కనీసం ప్రత్యామ్నాయం దారి కూడా లేదు. ఒకవేళా గేటు తీసినా అప్పటికే ఇరువైపుల వాహనాలు ఆగి ఉండడంతో గేటు తెరవగానే వాహనాలన్ని కదలడం వల్ల అత్యవసర వాహనాలైన 108, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ సైతం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సిన పరిస్థితులున్నాయి. గేటు వేసిన ప్రతిసారి ఇలా వాహనాలకు కష్టాలు తప్పడం లేదు. ఫ్లైఓవర్ నిర్మిస్తే ఈ సమస్య పరిష్కారం అవుతాయని ఆగ్రామాల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. సంబంధిత అధికారులు అదిదో... ఇదిగో అంటు ఊరిస్తున్నారే తప్ప.. ఫ్లై ఓవర్ నిర్మించలేదని వాపోతున్నారు. ఎప్పుడు ఫ్లై ఓవర్ నిర్మిస్తారో... ఎప్పుడు ఈ సమస్య పరిష్కారం అవుతుందోనని అని ఆ గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు.



గేటు వేయడంతో వాహనదారుల నిరీక్షణ

నీరుగారిన క్రీడలు

- వర్షానికి కారిన ఇండోర్‌స్టేడియం
- కోర్టుల్లో వర్షం నీరు నిల్వ
- షార్ట్‌సర్క్యూట్‌తో ఆగిన విద్యుత్తు





ఇండోర్ స్టేడియం ఆవరణంలో వర్షం నీరు , నీటి మడుగును తలపిస్తున్న కబడ్డీ గ్రౌండ్



ఇండోర్‌లో మ్యాట్లపై నిల్వ ఉన్న వాన నీరు

అనంతపురం క్లాక్‌టవర్, మే 21: నగరానికి ఉన్న ఏకైక ఇండోర్‌స్టేడియం వర్షం కారణంగా మూసివేశారు. వర్షంతో ఇండోర్‌స్టేడియం మొత్తం వర్షం నీరు లీకై తడిసిపోయింది. ఇండోర్‌స్టేడియంలో ప్రతి నిత్యం షటిల్ బ్యాడ్మింటన్, ఫెన్సింగ్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్ క్రీడాకారులు సాధన చేస్తుంటారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి స్టేడియం మొత్తం వర్షం నీటితో నిండిపోయింది. మరోవైపు ఇండోర్‌స్టేడియం పైకప్పు శిథిలావస్థకు చేరడంతో నీరంతా లోపలికి చేరంది. షటిల్ మ్యాట్ మొత్తం తడిసిపోయింది. మరోవైపు వర్షంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో క్రీడాకారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలే వేసవి సెలవుల్లో క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్న క్రీడాకారులకు ఇండోర్ స్టేడియంలోకి వర్షం నీరు వచ్చి, మూసి వేయడం నిరాశ కలిగిస్తోంది. వర్షపు నీరు నిల్వ, చీకట్లతో ఇండోర్‌స్టేడియం దీనావస్థలో ఉండిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇండోర్‌స్టేడియం మరమ్మత్తులు చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఏపీసీఎల్ విజేత అనంత

అనంతపురం క్లాక్‌టవర్, మే 21: అనంతపురం ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఏపీసీఎల్) సీజన్-2 విజేతగా అనంత రైజింగ్ స్టార్స్ జట్టు నిలిచింది. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఏపీఎల్-2 క్రికెట్ పోటీల ఫైనల్ పోరు మంగళవారం జరిగింది. ఫైనల్‌లో అనంత రైజింగ్ స్టార్, ఇండియన్ సిక్సర్స్ జట్లు మధ్య జరగగా... అనంత రైజింగ్ స్టార్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లుకు 132 చేసింది. ఇందులో ప్రశాంత్ 58 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అనంతరం బరిలోకి ఇండియన్ సిక్సర్స్ జట్టు 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 113 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. దీంతో అనంత రైజింగ్ స్టార్స్ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా రాజు కుళ్లాయప్ప, ఉత్తమ బ్యాటర్‌గా యోగానంద, ఉత్తమ బౌల ర్‌గా హరిశంకర్ రెడ్డి నిలిచారు. విజేతలకు ఆర్డీటీ ఛైర్మన్ తిప్పేస్వామి, మాజీ భారత క్రీడాకారుడు సునేత్ర పరానజపే బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, ఉపాధ్యక్షుడు సత్య నారాయణరెడ్డి, కోశాధికారి షబ్బీర్ అహ్మద్, సహాయ కార్య దర్శి భీమలింగారెడ్డి, మేనేజర్ ఖాజా మొహిద్దీన్, ఐపీఎల్ క్రీడాకారులు విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ హరీ‌ష్‌యాదవ్, జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకుంటున్న రాజు కుళ్లాయప్ప



విజేత అనంత రైజింగ్ స్టార్స్ జట్టు



రన్నర్‌గా నిలిచిన ఇండియన్ సిక్సర్స్ జట్టు

వైభవంగా నృసింహ జయంతి

అనంతపురం కల్చరల్, మే 21 : నృసింహ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని పలు ఆలయాల్లో వేడుకలను నిర్వహించారు. పాతూరులో వ్యాసరాజ మఠంలోని నృసింహస్వామి దేవాలయంలో నృసింహ స్వామి మూలవిరాట్‌కు నిర్మాల్య విసర్జన చేయ డంతోపాటు వివిధ అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నృసింహ స్వామి, మహాలక్ష్మి ఉత్సవ మూర్తులను అలంకరించి కల్యాణోత్సవం నిర్వహించారు. మహామంగళహారతి నివే దన అనంతరం భక్తులకు తీర్థప్రసాద, అన్నదాన వినియో గం చేశారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ మూర్తులతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వ్యాసరాజ మఠంలో నృసింహస్వామి

గుండెపోటుతో అర్చకుడి మృతి

అనంతపురం క్లాక్‌టవర్, మే 21 : హౌసింగ్‌బోర్డులోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రధాన అర్చకుడు శ్రీధర్ శర్మ(74) గుండెపోటుతో మరణించాడు. సోమవారం శ్రీధర్‌శర్మకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. శ్రీధర్‌శర్మకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. 2001లో ఆలయ ప్రారంభం నాటి నుంచి శ్రీధర్ శర్మ ప్రధాన అర్చకులుగా సేవలం దించారు. శ్రీధర్‌శర్మ మృతికి ఆలయ కమిటీ ఛైర్మన్ కేశవచంద్రరావు, మేనేజింగ్ ట్రస్టీ ప్రతాప్‌రెడ్డి, ధర్మకర్తలు శ్రీనివాసులు రెడ్డి, లక్ష్మీదేవమ్మ, అనీల్, గోవిందులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



శ్రీధర్‌శర్మ (ఫైల్)

వర్ష బాధితులకు అండగా ఉందాం

కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, మే 21 : అనంతపురం అర్బన్ పరిధిలో వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉండాల్సిన అవసరం ఉందని కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశమైన అయన మాట్లాడారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో వర్షానికి డ్రైనేజీ కాలువల్లోని నీరు రోడ్లపైకి పొంగిపొర్లి ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి సమయాల్లో పార్టీ వారు ప్రజలకు అండగా ఉండాలన్నారు. వైసీపీ నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వస్తారని, ఆ తర్వాత ప్రజలకు ఏ కష్టం వచ్చినా కనిపించరని అన్నారు. ఇలాంటి సమయాల్లో టీడీపీ వారే ప్రజలకు సహాయసహకారాలు అందించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు మరో పక్షం రోజుల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు సహకారంతో అనంత అర్బన్‌లో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు లోతట్టు ప్రాంతాల్లోని కాలనీల్లోని ఇళ్లు వర్షాలు వచ్చిన సమయంలో ముంపునకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండవీటి సుధాకర్ నాయుడు, రాయల్ మురళీ, ముక్తియార్, కృష్ణకుమార్, పోతుల లక్ష్మీనరసింహులు, రాజారావు, గోపాల్ గౌడ్, వన్నూరప్ప, గోళ్ల సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత పెంచాలి : జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను మరింత పెంచాలని కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కోరారు. మంగళవారం జేఎన్‌టీయూలోని అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూం భద్రతను టీడీపీ నాయకులతో కలిసి ఆయన సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వైసీపీ అసాంఘిక శక్తుల అరాచకాలకు పాల్పడుతున్నాయని, వాటిని దృష్టిలో ఉంచుకొని ఇక్కడ భద్రతను పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాజుల ఆదెన్న, జయరాంనాయుడు పాల్గొన్నారు.

హాకీ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం క్లాక్‌టవర్, మే 21: హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్తంగా ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న వేసవి హాకీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి అనీల్‌కుమార్ తెలిపారు. హాకీ కోచ్‌లు మల్లికార్జున, చౌడేశ్వర్‌ల ఆధ్వర్యంలో బాల, బాలికలకు శిక్షణ సాగుతోందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాలిటెక్నిక్‌తో ఉద్యోగ అవకాశాలు

అనంతపురం సెంట్రల్, మే 21: పాలిటెక్నిక్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు పారిశ్రామిక శిక్షణ తరగతులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జపాన్‌కు చెందిన బహుళ జాతీయ సంస్థ ముసాషి ఆటో పార్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఆరునెలల పారిశ్రామిక శిక్షణ ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. ప్రతి విద్యార్థికి నెలకు రూ.18 వేల శిక్షణా భృతితో పాటు ఉచిత రవాణా, బీమా సౌకర్యాన్ని కల్పిస్తుందన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్ : స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో 'వరద హస్తం' కథల సంపుటి పుస్తకావిష్కరణ సభను నిర్వహిస్తున్నామని తెలుగు వెలుగు సామాజిక సాహిత్య సేవాసంస్థ వ్యవస్థాపకుడు టీవీ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సభలో సీనియర్ రచయిత్రి నిర్మలారాణి ఆ పుస్తకాన్ని ఆవిష్కరిస్తామన్నారు. సాహితీకారులు, సాహిత్యాభిమానులు విరివిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

దివ్యాంగుల చట్టాలపై అవగాహన

రామగిరి, మే 21: మండలంలోని రెడ్డివారిపల్లిలో టింబక్టు కలెక్టివ్ సహకారంతో ప్రతిబాసొసైటి ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అసొసైటి డైరెక్టర్ బావమ్మ మాట్లాడుతూ... దివ్యాంగులు ఐకమత్యంతో ముందుకు వెళ్లాలని, వారి కోసం రూపొందించిన ప్రత్యేక చట్టాల గురించి తెలుసుకోవాలని అన్నారు. మేనరికపు వివాహాల వల్ల జరిగే అనర్థాలు గురించి వివరించారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే పోలీసులు, అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మిలిత ప్రోగ్రాం మేనేజర్ జయశ్రీ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లకు భద్రత కల్పించారు

శింగనమల : శింగనమల నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్లు ఉంచిన స్ట్రాంగ్ రూంకు భద్రత కల్పించారు. మంగళవారం శింగనమల తహసీల్దార్ కార్యాల యంలోని పోస్టర్లు బ్యాలెట్ స్ట్రాంగ్ రూంకు 24 గంటల భద్రత కల్పించారు. స్ట్రాంగ్ రూం వద్ద ఇద్దరు పోలీసులుతో పాటు వీఆర్‌ఓలు డ్యూటీలు వేసిన ట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీను వెన్నెల తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ప్రభుత్వ ఉద్యోగులైనా వివక్షను ఎదుర్కోవాల్సిందేనా?

అనంతపురం సెంట్రల్, మే 21: ఉన్నత విద్యనభ్యసించి ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గ ఉద్యోగులు కూడా వైసీపీ ప్రభుత్వంలో వివక్షతను ఎదుర్కోవాల్సిందేనా అని ఎమ్మార్పీఎస్ నాయకులు మండిపడ్డారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్పే సమగ్ర శిక్ష శాఖలో ఏపీఓ నారాయణస్వామి దళిత ఉద్యోగులను టార్గెట్‌చేస్తూ మానసికంగా వేధిస్తున్నారని వాపోయారు. తోటి ఉద్యోగుల ముందు దళిత ఉపాధ్యాయులను అవహేళన చేసినా ఉన్నతాధికారులు కళ్లు, చెవులు మూసుకోవడం సిగ్గుచేటన్నారు. ఏపీఓపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆ కార్యాలయాన్ని నిర్భంధించి నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నారాయణస్వామి, శ్రీకాంత్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లయినా తప్పని తిప్పలు..!

అధ్వాన స్థితిలో కక్కలపల్లి, రుద్రంపేట ప్రధాన రహదారులు

అనంతపురంరూరల్, మే 21: మండలంలోని కక్కలపల్లి, రుద్రంపేట ప్రధాన రహదారులు అధ్వాన స్థితిలో ఉన్నాయి. మూడేళ్లుగా రుద్రంపేట ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నేటికీ ఆ రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. దీంతో రుద్రంపేట సర్కిల్ నుంచి పీవీకేకే ఇంజినీ రింగ్ కళాశాల వరకు ఉన్న ఆలమూరు రోడ్డు ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తోంది. గాయిత్రి మిల్క్ డైరీ సమీపంలో రోడ్డు మరి అధ్వానంగా ఉంది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పక్కన వైపు నుంచి వెళ్దామన్నా.. రోడ్డు నిర్మాణం కోసం తోలిన కంకర అడ్డుగా ఉంది. దీంతో ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతం. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఆ రోడ్డు మరింత అధ్వానం గా తయారైంది. ఈ ప్రయాణ కష్టాలు ఎప్పటికీ తీరెనో అంటూ ప్రయాణి కులు వాపోతున్నారు. ఇక కక్కలపల్లి క్రాస్ నుంచి కక్కలపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు కూడా ఇదే విధంగా ఉంది. రోడ్డు మొత్తం దెబ్బతింది. టమోటా మార్కెట్ ప్రధాన రోడ్డంతా పెద్ద.. పెద్ద.. గుంతలున్నాయి. నిత్యం పెద్ద పెద్ద వాహనాలు వచ్చి.. పోతుండటంతో గుంతలు ఏర్పడ్డాయి. అయినా వీటి గురించి పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఈ రోడ్లపై ప్రయా ణం చేయాలంటే ఒళ్లు హూనం అవుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్డు ఎప్పుడేస్తారో.. ఈ సమస్య ఎప్పటికీ తీరెనో అని మండిపడుతున్నారు.



గుంతలమైపోయిన కక్కలపల్లి టమోటా మార్కెట్ రోడ్డు





నత్తనడకన సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు



రుద్రంపేట , ఆలమూరు రోడ్డు

గడువు ఇవ్వండి .. ఆలోచించి చెబుతా...!

మామిడి వేలం నగదు చెల్లింపుపై వైసీపీ నేత నిర్లక్ష్య సమాధానం

బుక్కరాయసముద్రం, మే 21: అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలులో మామిడి పంట లీజు నగదు చెల్లింపుపై అధికార పార్టీ నేత నిర్లక్ష్య సమాధానం ఇచ్చినట్లు సమాచారం. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'మామిడి అమ్మి... మస్కా' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలులో రాయలసీమ జైళ్ల శాఖ డీఐజీ రాజేశ్వరరావు ముందు లీజుదారుడు, వైసీపీ నేత హాజరయ్యాడు. నిబంధనల మేరకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.30 లక్షలు చెల్లించాలని లీజు దారుడిని జైలు ఉన్నతాధికారులు అడిగారు. దీనిపై లీజుదారుడు మాట్లాడుతూ.. ఈ ఏడాది చాలా నష్టం వచ్చిందని, పంట కాపు రాలేదని దీంతో తీవ్రంగా నష్టపోతున్నానని చెప్పినట్లు సమాచారం. అయినా అగ్రిమెంట్ ప్రకారంగా ప్రభుత్వానికి నగదు చెల్లించాలని అధికారులు సూచించినట్లు తెలిసింది. నగదు చెల్లింపు విషయంపై రెండు రోజుల్లో ఆలోచించి చెబుతాను అని, అంత వరకు తనను ఒత్తిడి చేయవద్దని జైలు అధికారులకు సూచించినట్లు సమాచారం. రెండు రోజుల్లో ఆ నగదు చెల్లించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకో వాల్సింటుందని అధికారులు తేల్చి చెప్పినట్లు సమాచారం.

ఉపాధి పనులు కల్పించి.. ఆదుకుంటాం

మాజీ మంత్రి పరిటాల సునీత



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పరిటాల సునీత

రామగిరి, మే 21: మరో 15 రోజుల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తోందని, అప్పుడు ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించి ఆదుకుంటామని మాజీ మంత్రి పరిటాల సునీత హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామ నుంచి సమీప పొలానికి వెళ్తున్న ఆమె.. ఉపాధి కూలీలు పనిచేయడాన్ని గమనించి వారి వద్దకు వెళ్లి పరిస్థితులపై ఆరా తీశారు. కూలీలు మాట్లాడుతూ.. ప్రతి రోజు తమకు పనులు కల్పించడం లేదని, కూలీ కూడా గిట్టుబాటు కాలేదని ఆమె వద్ద వాపోయారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికి త్వరలోనే పరిష్కారం చూపుతామని వారికి భరోసా ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో కుర్ల పల్లయ్యస్వామి ఉరేగింపు



కుర్లపల్లయ్యస్వామిని ఉరేగిస్తున్న భక్తులు

రాప్తాడు, మే 21: శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం ధర్మపురిలో ధర్మపురి కుర్లపల్లయ్య స్వామిని మంగళవారం రాప్తాడులో వైభవంగా ఉరేగించారు. రాప్తాడు గ్రామానికి చెందిన పామాల కొండప్ప, విజయలక్ష్మి తమ ఇంటి ఇలవేల్పు దేవుడు కుర్లపల్లయ్య స్వామిని రాప్తాడుకు తీసుకుని వచ్చి భక్తిశ్రద్ధలతో ఉరేగించి పూజలు చేశారు. గ్రామ పురవీధుల్లో వైభవంగా ఉరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చెన్నేకొత్తపల్లి, మే 21: మండలంలోని ఎన్‌ఎస్‌గేటు సమీపంలో మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మరణించాడు. కనగానపల్లి మండలం తల్లిమడుగులకు చెందిన కుమ్మరనాగరాజు, రంగరత్నమ్మల ఏకైక కుమారుడు ఆనంద్ (23). స్వగ్రామం నుంచి చెన్నేకొత్తపల్లికి అతను మంగళవారం బైక్‌పై బయలుదేరాడు. చెన్నేకొత్తపల్లికి చెందిన మోహన్‌రెడ్డి, మేడాపురానికి చెందిన సాయినాథ్ రెడ్డి చెన్నేకొత్తపల్లి నుంచి ద్విచక్రవాహనంలో నసనకోటకు బయలుదేరారు. మండల సరిహద్దు ప్రాంతంలో ఆ రెండు ద్విచక్రవాహనాలు వేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆ ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆనంద్ మరణించాడు. మోహన్‌రెడ్డి, సాయినాథ్‌రెడ్డి అనంతపురం ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలించారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేపట్టారు.



ఆనంద్ (ఫైల్)

సరిహద్దులు తేలక.. : ప్రమాదం జరిగిన ప్రదేశం సరిహద్దుపై పోలీసుల్లో సంద్రిగ్ధత నెలకొంది. ఆ ప్రాంతం తమ పరిధిలోకి రాదంటూ రామగిరి, సీకేపల్లి పోలీసులు ఒకరిపై ఒకరు చెప్పుకున్నారు. చివరికి సీకేపల్లి-2 వీఆర్వో లోకేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి సీకేపల్లి సరిహద్దులోకే వస్తుందని తేల్చిచెప్పారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

నార్పల, మే 21: నార్పలలో వాసి సాకే పోతులయ్య (57) అతిగా మద్యం తాగి... మత్తులో ఆత్మహత్య చేసుకున్నాడు. అతను కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత ఏడాదిగా అతిగా మద్యం సేవిస్తూ కుటుంబీకులతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన అతను సోమవారం రాత్రి మద్యంలో సెల్ఫాషన్ కలుపుకొని తాగాడు. అంతటితో ఆగని పోతులయ్య బ్లేడ్‌తో గొంతు కోసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంట సభ్యులు అతన్ని 108 ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పోతులయ్య మంగళవారం ఉదయం మరణించాడు. పోతులయ్యకు భార్య ఆదిలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవం


అలంకరణలో స్వామివారి మూలవిరాట్

తాడిపత్రిటౌన్, మే21: మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓబులేసుకోనలో మంగళవారం లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత స్వామి ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ, మంగళవాయిద్యాలతో కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

నీరు ఇంకి పోయేలా దుక్కులు దున్నాలి

గుంతకల్లుటౌన్, మే 21: రైతులు పొలంలో నీరు ఇంకిపోయే విధంగా దుక్కులు దున్నాలని డీఆర్సీ డీడీఏ మద్దిలేటి, ఏడీఏ శైలజ పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులోని ఆర్బీకేలో మంగళవారం ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుపై రైతులతో సమావేశం నిర్వహించారు. వేరుశనగ, కంది, ఆముదంలో అధిక దిగుబడి గురించి, విత్తన శుద్ధి, కలుపు నివారణ, ఎరువుల వినియోగం, పురుగు మందుల వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కే స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

గుంతకల్లుటౌన్, మే 21: పట్టణంలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణం లోని గాంధీచౌక్, ఎన్టీఆర్ సర్కిల్, అంజుమన్ సర్కిల్, ధర్మగేట్ రోడ్డు ఏరియాల్లో స్పెషల్ పార్టీ పోలీసులు సీఐ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఉరవకొండ, మే 21: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సురేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని రాకెట్ల, కౌకుంట్ల, గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాలలో స్పెషల్ పార్టీ పోలీసులు కవాతు నిర్వహించారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాఘవేంద్రప్ప పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగిద్దాం

ఉరవకొండ, మే 21: రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీన పేర్కొన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓబులేశు, సుధాకర్ పాల్గొన్నారు.

శనగలగూడూరులో సీఐ పర్యటన

పుట్లూరు, మే21: మండలంలోని శనగలగూడూరు గ్రామంలో మంగళవారం సీఐ సుబ్రహ్మణ్యం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాల్లో ఏ పార్టీ గెలిచినా ఎలాంటి విజయోత్సవాలు, బాణసంచా పేల్చడం, ర్యాలీలు చేయడం వంటివి చేయరాదని తెలిపారు. ఘర్షణలకు దిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెళుగుప్పలో కార్డెన్ సెర్చ్


బెళుగుప్పలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

బెళుగుప్ప, మే 21: మండల కేంద్రంలో మంగళవారం సీఐలు ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శివ, సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామంగా బెళుగుప్పను గుర్తించి అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడంలో భాగంగా అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. 144 సెక్షన్ అమలులో వుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం అల్లర్లు జరుగకుండా నిఘా ఉంచుతున్నామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం



గుత్తి, మే 21: పట్టణంలోని మన్రోసత్రం సమీపంలో స్ట్రీట్‌లైట్ స్తంభాన్ని లారీ ఢీకొంది. గుత్తి నుంచి నందికొట్కూరుకు బొగ్గులోడ్‌తో వెళ్తున్న లారీ స్థానిక మన్రోసత్రం సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం రోడ్డుపై అడ్డంగా నేలకూలింది. సమీపంలో జనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న అధికారులు సంఘటన స్థలాన్ని చేరుకుని మరమ్మతులు చేపట్టారు.

సెలవులు అడగొద్దండి: తహసీల్దార్


రెవెన్యూ సిబ్బందికి జారీ చేసిన సర్క్యులర్

యాడికి, మే21: శాంతిభద్రతల నిమిత్తం రెవెన్యూ సిబ్బంది సంబంధిత గ్రామాల్లో ఉండాలని ఆదేశిస్తూ తహసీల్దార్ మోహనవల్లి సర్క్యులర్ జారీచేశారు. గ్రామాల్లో సమావేశాలు, ఉత్సవాలు, ర్యాలీలు జరపనీయరాదని అందులో పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరిరైనా ఇళ్ల వద్ద రాళ్లు, కట్టెలు, ఇనుపసామగ్రిని తొలించి ఉంటే వారితో మాట్లాడి తీసి వేయించాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెవెన్యూ సిబ్బంది ఎవరూ సెలవులు అడగరాదని సర్క్యులర్‌లో పేర్కొనడం గమనార్హం. ఈ సర్క్యులర్ కలెక్టర్ ఆదేశాలమేరకు జారీ చేయడమైందని, రెవెన్యూ సిబ్బంది ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా ధ్వజారోహణం


ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఉరవకొండ, మే 21: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ధ్వజరోహణ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకానాథాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహిచారు. రాత్రి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా పెద్దముష్టూరుకు చెందిన గుంద్రాయప్ప కుటుంబసభ్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఈవో విజయ్ కుమార్, అర్చకులు ఆలయ సిబ్బంది మారుతి, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నృసింహజయంతి

మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా సింహవాహనోత్సవం, చంద్రప్రభ వాహనోత్సవాలు నిర్వహించనున్నారు.

పాత రథానికి ట్రయల్ రన్

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రథోత్సవ నిర్వహణకోసం పాతరథానికి మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. గత ఏడాది రథం కూలిపోయి దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఆ రథానికి తాత్కలిక మరమ్మతులు చేశారు. దీంతో ఈ నెల 28న జరిగే రథోత్సవం నాటికి రథం సిద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా ట్రయల్ రన్ చేపట్టారు. పాత రథానికి అర్చకులు, ఈవో పూజలు నిర్వహించి రథాన్ని కొంత దూరం లాగారు. యథాస్థానికి చేర్చే సమయంలో రథం కదలకపోవడంతో ట్రాక్టర్లకు తాళ్లుకట్టి లాగారు. ఈ రథానికి సంబంధించి ఆర్ అండ్ బీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంది.

గాలీవానకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

యాడికి, మే 21: సోమవారం రాత్రి మండలంలో కురిసిన గాలీవానకు వెంగన్నపల్లి గ్రామంలో మూడువిద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ స్తంభాలు మూడు వ్యవసాయ బోరుబావులకు సంబంధించినవి కావడంతో రైతులు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఈ స్తంభాలకు విద్యుత్ సరఫరా నిలిపివేసి, మిగిలిన ప్రాంతాల్లో పునరుద్ధరించారు. రాత్రంతా కరెంట్ సరఫరా లేక వెంగన్నపల్లి గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు.

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం గ్రామంలో సోమవారం రాత్రి వీచిన భారీగాలులకు 11 కేవీ విద్యుత్‌వైరు తెగిపడిపోయింది. దీంతో రాత్రి నుంచి ఉదయం 10గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తిరుమలాపురం, చిలమకూరు, అచ్యుతాపురం గ్రామాలకు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.


వెంగన్నపల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం(యాడికి)


తిరుమలాపురం వద్ద తెగిపడిన విద్యుత్ తీగ(యల్లనూరు)


పత్తి తోటలో నీరు నిల్వ ఉండటంతో వాడిన మొక్కలు

రెండురోజులుగా వర్షం.. పత్తి పంటలకు నష్టం

బొమ్మనహాళ్: మండలంలో రెండురోజులుగా వర్షం కురుస్తుండటంతో పత్తిపంటలకు నష్టం కలుగుతోందని రైతులు వాపోతున్నారు. ఆది, సోమవారం రాత్రుల్లో రెండురోజుల పాటు వర్షం పడింది. దీంతో పత్తిపంటలకు తేమశాతం ఎక్కువైంది. మొక్కలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెట్లు కుళ్లిపోతున్నాయని రైతులు అన్నారు. సోమవారం రాత్రి 13.10 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్, రంగాపురంక్యాంప్ తదితర గ్రామాలలో ఓ మోస్తరు వర్షం పడింది.

కేటీఎస్ చానల్ విధ్వంసకులపై చర్యలు తీసుకోవాలి


జుంజురంపల్లిలో వీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

రాయదుర్గంరూరల్, మే 21: మండలంలోని వేదవతి హగరిలో ఇసుక తరలింపునకు కేటీఎస్ చానల్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వేపరాల గ్రామస్థులు వన్నూరప్ప, వీరేష్, వెంకటేశులు, నాగరాజు, చిన్నరాజప్పలు కోరారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చిట్టిబాబుకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేటీఎస్ చానల్‌ను ఇష్టానుసారంగా ధ్వంసం చేయడంతో వర్షాకాలంలో వర్షపునీరు హగరినదిలోకి వెళుతున్నట్లు తెలిపారు. గతంలో కేటీఎస్ చానల్ ఉండటంతో వర్షపునీరు కాలువ ద్వారా వచ్చి, బోరుబావులు రీచార్జ్ అయ్యేవి అన్నారు. హగరినది రీచ్‌లో ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తూ ఇలా ధ్వంసం చేసి గుత్తేదారులు వెళ్లిపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక రీచ్‌ను కొనసాగిస్తే రైతులకు తీవ్ర నష్టం

మండలంలోని జుంజురంపల్లి సమీపంలోని వేదవతిహగరిలో రీచ్‌ను కొనసాగించడంతో అడ్డగోలుగా ఇసుకను తరలించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు గ్రామానికి చెందిన లచ్చన్నచౌదరి, బొబ్బిరి రమేష్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సచివాలయంలో వీఆర్వో భీమప్పకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఇసుకరీచ్ ప్రారంభించడం వల్ల భూగర్భజలాలు క్రమ క్రమంగా తగ్గుతూ వస్తున్నాయన్నారు. దీనివల్ల జుంజురంపల్లి, మల్కాపురం గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఇసుకరీచ్ ప్రారంభించడం వల్ల తాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. బోరుబావుల్లో నీరు తగ్గడంతో పంట పొలాలు ఎండిపోతున్నా యన్నారు. గుత్తేదారులు 20 అడుగుల నుంచి 40 అడుగుల లోతు వరకు ఇసుకను తవ్వడం వల్ల భూగర్భజలాలు అడుగంటిపోయినట్లు తెలిపారు. తమ గ్రామంలో ఇసుకరీచ్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వన్నూరుస్వామి, వీరేష్‌స్వామి, గోవిందరాజులు, తిమ్మారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతుపై విరిగిన లాఠీ

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు


చికిత్స పొందుతున్న బాధితుడు అశోక్

కళ్యాణదుర్గం, మే 21: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన రైతు అశోక్‌పై పోలీసులు లాఠీ ఝుళిపించారు. దీంతో ఆయన ఎడమ చేయి విరిగింది. మూడు రోజుల కిందట ఈ సంఘటన జరగ్గా మంగళవారం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. బాధిత రైతు తెలిపిన మేరకు ... రైతు అశోక్ మరో ఇద్దరు రైతులతో కలిసి ద్విచక్ర వాహనంపై రాత్రి ఎనిమిది గంటల సమయంలో పొలానికి వెళ్లి పంటకు నీరు పెట్టి ఇంటికి వస్తున్నారు. ఆ సమయంలో దారి మధ్యలో కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు వారిని ఆపారు. ఈ సమయంలో ఎక్కడికి వెళ్లి వస్తున్నారని ప్రశ్నించారు. తాగి వస్తున్నారా అంటూ అశోక్‌ను లాఠీతో బలంగా కొట్టారు. ఈక్రమంలో పోలీసులు, రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం రైతులు ఇంటికి వెళ్లారు. ఉదయానికి అశోక్ ఎడమ చేయి వాపు రావడంతో ఆస్పత్రికి వెళ్లాడు. ఇదే విషయాన్ని తనను కొట్టిన ఇద్దరు పోలీసులకు సమాచారం అందించాడు. ప్రభుత్వాస్పత్రికి కాకుండా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలని ఆ పోలీసులు బాధిత రైతుకు సూచించారు. వారి సూచన మేరకు అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. మూడు రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి ఆరోగ్య సమాచారాలను ఆరా తీయడంలో నిర్లక్ష్యం వహించి తమకేమి సంబంధం లేదన్నట్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం జరుగకపోతే పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని బాధిత రైతు హెచ్చరించాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, మే 21: మండలంలోని వన్నేదొడ్డి గ్రామశివారు 44వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున రెండు కార్లు ఢీ కొనడంతో నరసింహులు అనే యువకుడు గాయపడ్డాడు. గ్రామానికి చెందిన నరసింహులు తెల్లవారుజామున తన కారులో గుత్తికి వస్తుండగా గ్రామశివారులో రోడ్డు దాడుతుండగా మరో కారు వచ్చి ఢీ కొట్టింది. దీంతో నరసింహులుకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. ఈ సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేప్పట్టారు.

నాసిరకంగా పనులు చేసి నిధులు కాజేశారు


షట్టరును చూపిస్తున్న టీడీపీ నాయకులు

● టీడీపీ నాయకుల ఆరోపణ

బొమ్మనహాళ్, మే 21: చెరువు పనులను నాసిరకంగా చేసి మంజూరైన నిధులను వైసీపీ నాయకులు కాజేశారని టీడీపీ మండల కన్వీనర్ బలరామిరెడ్డి, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి ఎస్సీ నాగరాజుస్వామి ఆరోపించారు. మండలంలోని శ్రీధరఘట్ట చెరువును వారు మంగళవారం పరిశీలించారు. గత ఏడాది నాబార్డు నిధులు రూ. 50 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టారన్నారు. పనులు నాశిరకంగా చేయడంతో తూములకున్న షట్టర్లు కూడా సక్రమంగా పనిచేయడం లేదన్నారు. చెరువు గట్టుకు అప్పుడే బీటలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సైతం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా నిర్లక్ష్యంగా ఉండటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తూముల ద్వారా నీరు వెళ్లేందుకు ఎక్కువస్థాయిలో వెడల్పు పెట్టడంతో నీరు నిల్వ ఉండటం లేదని ఒక్క పంటకే నీరు సరిపోతాయని తెలిపారు. వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ అవతారం ఎత్తి వచ్చిన నిధులను దోచుకున్నారని విమర్శించారు. అధికారులు ఇప్పటికైనా వర్షం నీటితో చెరువు నిండకముందే షట్టర్లు బాగుచేయాలని చెరువుకట్టను భద్ర పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి, టీడీపీ నాయకులు కావలి రాము, రవిచంద్రసాగర్, ఎర్రిస్వామి, పోతప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓబుళదేవర మహోత్సవం

రాయదుర్గంరూరల్, మే 21: మండలంలోని రేకులకుంట గ్రామంలో ఓబుళదేవర మహోత్సవాన్ని భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని గ్రామం బయటకు తీసుకెళ్లి గంగపూజ నిర్వహించారు. అనంతరం గ్రామంలో స్వామివారిని అందంగా అలంకరించి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాళ్లదాడి కేసులో నిందితుల కోసం విస్తృత గాలింపు


బస్టాండ్‌లో తనిఖీలకు సిద్ధంగా ఉన్న పోలీసులు

తాడిపత్రిటౌన్, మే21: ఎన్నికల సందర్భంగా తాడిపత్రిలో జరిగిన రాళ్లదాడి కేసుకు సంబంధించిన ఆందోళనకారులను పట్టుకోవడం కోసం పోలీసు అధికారులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, శివార్లలో ప్రతి ఒక్కరిని తనిఖీ చేసి పంపుతున్నారు. పలుచోట్ల గొడవలకు సంబంధం లేని వారిని సైతం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువస్తున్నారన్న ప్రచారం ఉంది. నిందితులను గుర్తించి అరెస్టులు చేస్తే బాగుంటుందని, ఎవరిని పడితే వారిని అరెస్ట్‌చేసి కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. రెండురోజులక్రితం మండలంలోని బుగ్గ, తేళ్లమిట్టపల్లి, వెంకటాంపల్లి గ్రామాల నుంచి పలువురిని అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తీసుకువచ్చారు. వీరిలో సగం మందికి ఎలాంటి సంబంధం లేకపోయిన స్టేషన్‌కు తీసుకురావడంతో వారి కుటుంబ సభ్యులు భయాందోళన చెందుతున్నారు. అల్లర్లకు సంబంధం లేదని తెలిసినప్పటికి వారిపై కేసు నమోదు చేయడంలో ఆంతర్యం ఏమిటో పోలీసులకే తెలియాలి. మంగళవారం కర్నూలు జిల్లా బూర్గుల సమీపంలో ఉన్న పుణ్యక్షేత్రంలో ఉన్న తాడిపత్రి, యాడికి మండలాలకు చెందిన వారిని అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకోవడం గమనార్హం. వీరిలో కూడా ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు చాలామంది ఉన్నట్లు సమాచారం.

సింహవాహనంపై ప్రసన్న వెంకటరమణస్వామి


సింహవాహనంపై ఊరేగుతున్న ప్రసన్న వెంకటరమణస్వామి

రాయదుర్గంరూరల్, మే 21: పట్టణంలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సింహవాహనంపై ఊరేగారు. శ్రీవారికి అర్చకుల ఆధ్వర్యంలో గంగపూజ, నైవేద్యసేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ తదితర ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం యాదవుల సంఘం, కురుబ సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేక రథంలో ప్రతిష్ఠించి దేవాలయం వద్ద నుంచి తేరుబజార్, వినాయకసర్కిల్, పాతబస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా శ్రీవారి ఊరేగింపు భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. స్వామివారి ఊరేగింపును తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలించారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలి


వేరుశనగ విత్తన కాయలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

గుత్తి, మే 21: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఇండస్ట్రీల్ ఏరియాలో ఉన్న వేరుశనగ విత్తన ప్రాసెసింగ్ యూనిట్ పవన్ అగ్రో ఏజెన్సీని మంగళవారం ఆమె ఏడీఏ వెంకటరాముడుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో ప్రాసెసింగ్ చేసిన విత్తనం, రికార్డులను తనిఖీ చేశారు. వేరుశనగ ప్రాసెసింగ్ చేసే విధానంను వారు పరిశీలించారు. నిల్వ ఉన్న వేరుశనగ కాయలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓలు రాకేష్‌నాయక్, మెహరున్నీసా బేగం, ఏఓ ముస్తాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


డీఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న జనార్దన్‌నాయుడు

తాడిపత్రి టౌన్, మే 21: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నూతన డీఎస్పీగా జనార్దన్‌నాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డీఎస్పీ గంగయ్య రాళ్లదాడుల సంఘటనలో సస్పెండ్ అయిన విషయం విదితమే. ఈ స్థానంలో ఏలూరులో పని చేస్తున్న జనార్దన్‌నాయుడును నియమించారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిబ్బందితో ఇక్కడి పరిస్థితులపై ఆరాతీశారు. పట్టణ సీఐగా నాగేంద్రప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన మురళీకృష్ణ రాళ్లదాడి ఘటనపై సస్పెండ్ అయ్యారు. నూతన సీఐ నాగేంద్రప్రసాద్ అనంతపురంలో వీఆర్‌లో ఉండగా బదిలీపై తాడిపత్రికి వచ్చారు.

ఓటీఎస్ వేగవంతం చేయండి

బొమ్మనహాళ్, మే 21: సంపూర్ణ గృహహక్కు పథకంలో ఓటీఎస్‌ను వేగవంతం చేయాలని బొమ్మనహాళ్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఓటీఎస్‌ను వేగవంతం చేయాలని ఎంపీడీఓ సూచించారు. మండల వ్యాప్తంగా 90 మంది లబ్ధిదారులు ఉన్నారని రూ. నాలుగు లక్షల బకాయిలు రావాల్సి ఉందని ఎంపీడీఓ తెలిపారు. ఈ లబ్ధిదారులతో ఓటీఎస్ పథకంతో పూర్తి చేయించాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు వెంకటేశులు, జూనియర్ సహాయకులు గౌరీశంకర్, పంచాయతీ కార్యదర్శులు లోకేష్, మహేష్, శివన్న, రవి పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని వినతి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లుటౌన్, మే 21: పట్టణంలోని ఫక్కీరప్ప కాలనీలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు మంగళవారం సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో రెండేళ్ల నుంచి తాగునీటి పైపు లీకేజీ ద్వారా మురుగు నీరు వస్తోందన్నారు. పైప్‌లైన్ మార్చేందుకు మూడు రోజుల కిందట గుంతను తవ్వి పైపులు వేయకుండా తీసుకెళ్లారని, గుంతను పుడ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారన్నారు. మురుగు నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడితే తప్ప అధికారులు స్పందించరా అని ప్రశ్నించారు. అధికారులు వెంటనే తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపినాథ్, గడ్డం వెంకటేష్, కాలనీ వాసులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

బ్రహ్మసముద్రం, మే 21 : మండలంలోని నంజాపురం గ్రామానికి చెందిన గొల్ల రామన్న కుమారుడు చంద్ర (29) ఇంట్లో మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు తాగుడుకు బానిసైన చంద్ర భార్యతో గొడవపడేవాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు కూడా తనతో మాట్లాడేవారు కాదు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. బంధువులు మంగళవారం ఇంటి తలుపు కొట్టగా ఎంతసేపటికీ తీయలేదు. దీంతో వారు తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరి వేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. దీనిపై బ్రహ్మసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.